మళ్లీ ఏనుగులొచ్చాయ్..

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

రెండు నెలలుగా ఏనుగుల అలజడుల నుంచి ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటున్న మండల వాసులకు హఠాత్తుగా మళ్లీ ఏనుగుల గుంపు వచ్చి పడడంతో రైతులు ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. ఏనుగుల గుంపు శుక్రవారం రాత్రి మండలంలోని చింతల బెలగాం, రాజయ్యపేట మధ్య సంచరించాయి. రాత్రి 12, ఒంటి మధ్య ఒంటరి ఏనుగు రాజీపేటకు చేరుకొని హల్‌చల్ చేసింది. దీంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. అరటి, పామాయిల్, చెరకు తోటలు ఈ ప్రాంతంలో ఉండడంతో ఏనుగులు తమ పంటలు నాశనం చేస్తాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలలుగా ఊపిరి పీల్చుకున్న రైతాంగానికి ఏనుగులు గుంపు వచ్చి భయపెడుతున్నాయి. ఏనుగులు బెడద ఎప్పుడు తప్పుతుందా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొత్త ధాన్యాలతో.. కోడి పందేలతో..

ముగ్గులు వేస్తున్న యువతులు

సంక్రాంతి వచ్చిందే తుమ్మెద... సరదాలు తెచ్చిందే తుమ్మెద... కొత్తధాన్యాలతో... కోడి పందేలతో...ఊరేగిపోతుంటే... అంటూ సరదాల సంక్రాంతిని వర్ణించాడో కవి. అందుకు తగ్గట్టే నేటి సంక్రాంతి వేళ పల్లెలన్నీ ముస్తాబయ్యాయి. సంక్రాంతి అనగానే పల్లెటూరి వాతావరణం కళ్ల ముందు కదలాడుతుంది. మట్టికి, మనిషికి ఉన్న అన్యోన్య బంధాన్ని గుర్తు చేస్తుంది. జనం సొంత ఊళ్లకు పరుగు పరుగున చేరుకుంటున్నారు. గడిచిన మూడు రోజులుగా బస్సులు, రైళ్లు ఖాళీలేవంటే అతిశయోక్తి కాదు. కరోనా మహమ్మారి ఆగ్రహానికి గడిచిన రెండేళ్లగా పండగ సరదాలు అంతగా లేవు. ఈ ఏడాది ఆర్థిక పరిస్థితులేమీ అంత అనుకూలంగా లేకపోయినప్పటికీ కనీసం ఇంటిల్లపాది కలుసుకుని పండగ నాలుగు రోజులైనా సరదాగా గడుపుకునేందుకు సన్నద్ధమయ్యారు. ఇలా వచ్చిన జనంతో పల్లెసీమలు కళకళాడుతున్నాయి. కొన్ని సంస్థలు, కార్యాలయాల్లో వారం రోజుల ముందు నుంచే సంక్రాంతి సందడి మొదలైంది. ప్రభుత్వం తరపున ఒక్క రోజు ముందే (శుక్రవారమే ఉదయమే భోగిమంటలు వేశారు. శిల్పారామంలో సంప్రదాయ వేషధారణ, పాటల కచేరీలు, రకరకాల పండివంటల తయారీతో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. శనివారం తెల్లవారు జామున జిల్లా అంతటా భోగిమంటలు వెలిగాయి.

బరిలో దిగిన కోళ్లు

గ్రామాల్లో సంక్రాంతి సందడి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పండగ అంటేనే సరదాలు సందళ్లు... అందులో సంక్రాంతి అంటే తెలుగువారింట చెప్పలేనంత అనుభూతి. స్నేహితులు, రక్త సంబంధీకులు అనురాగం, ఆప్యాయం పంచుకునే పర్వదినాలు. అందుకే ఈ పండక్కి నెలరోజుల ముందే.... అంటే నెలగంట పెట్టినప్పటి నుంచీ రోజూ క్రమం తప్పకుండా ఇళ్లు అలుక్కోవడం (శుభ్రం చేసుకోవడం), సున్నాలు వేసి ప్రత్యేకంగా ముస్తాబు చేయడం వంటి పనులు ప్రారంభిస్తారు. రకరకాల పూలు, రంగులతో ఇళ్ల ముందు వేసిన ముగ్గులు హరివిల్లును తలపించేవి. గొబ్బెమ్మలు పెడుతూ యువతంతా ఆటపాటలతో అలికిరి చేసేవారు. బుడబుక్కల వాళ్లు, హరిదాసులు, కొమ్మ దాసులు, జంగందేవర్లు.... కళలను ప్రదర్శించేవారు. పండగకు కొద్దిరోజుల ముందునుంచే పిండివంటకాలు ఘుమఘుమ లాడేవి. నూతన వస్త్రాలు, కిరాణా సామగ్రి తదితర సరుకుల క్రయ విక్రయాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కళకళలాడేది. బట్టల వ్యాపారులు సైకిళ్లపై గ్రామగ్రామాల్లో తిరిగి విక్రయించేవారు. ఇలా గ్రామసీమలు కళకళలాడేవి. ఇదంతా ఒకప్పటి మాట. నేడు ఆ పరిస్థితులు మారాయి. మారుతున్న పరిస్థితులు నాటి సంస్కృతి సంప్రదాయాలను కనుమరుగు చేస్తున్నాయి. ఏటా పండగ తీరుమారు తుండడమే ఇందుకు నిదర్శనం. గంగిరెద్దులు, హరిదాసులు గ్రామాలు, పట్టణాల్లో తిరుగుతున్నా మునుపటి ఉత్సాహం వారిలో కనిపించడం లేదు.

పండగలు... ఉత్సవాలు... జాతరలు... మానవ సంస్కృతిలో భాగం. కొన్ని పండగలు ఉత్పత్తితో ముడిపడి ఉంటాయి. మరికొన్ని ప్రకృతిపై మానవుడు సాధించిన విజయాలకు చిహ్నంగా నిలుస్తాయి. ఇంకొన్ని పూర్తిగా కుల, మత నమ్మకాలపై ఆధారపడి ఉంటాయి. ఇందులో మొదటి కోవకు చెందిందే సంక్రాంతి పండగ. జిల్లాలోని 70శాతం కుటుంబాలు వ్యవసాయంతో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ముడిపడి ఉన్నవే. ఈ ఏడాది వర్షాలు అనుకూలించడంతో ఎక్కువ ప్రాంతాల్లో పంటలు మంచి దిగుబడి వచ్చాయి. కానీ, వాటికి మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించడంతో రైతుల ఇబ్బందులు ఎప్పటి మాదిరిగానే ఉన్నాయి. పండక్కి పక్షం రోజుల ముందే ధాన్యం, ఇతరత్రా వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించి, కొత్తబట్టలు, సంక్రాంతి సరుకులు కొనుక్కునే నాటి పరిస్థితులు నేడు పూర్తిగా తలకిందులయ్యాయి. ధాన్యం సకాలంలో కొనుగోలు చేయక, కొనుగోలు పేరుతో జరుగుతున్న దోపిడీ, బిల్లులు సకాలంలో చెల్లించక ఆర్థిక ఇబ్బందులతో సతమత మౌతున్నారు. చెరకు రైతులదీ అదే పరిస్థితి. రైతాంగం వీటన్నింటిని దిగుమింగుతునే సంక్రాంతి సరదాలకు సిద్ధమైంది.

హరిదాసుకు దానం చేస్తున్న చిన్నారులు

భోగి మంటల్లో జిఒ 1 కాపీలు

పలుచోట్ల సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన జిఒ ప్రతులు దహనం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిఒ 1ని ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వేసిన భోగి మంటల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే జిఒ 1ను రద్దు చేయాలని కోరుతూ మున్సిపల్ ఆటో కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి జి వెంకటరమణ మాట్లాడుతూ జీవో 1ను వెనక్కి తీసుకోవాలని, లేనిచో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు శంకర సింహాచలం, ఆటో వర్కర్స్ నాయకులు నాగభూషణం, కృష్ణ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యాన

సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు పట్టణంలోని వినూత్న రీతిలో భోగి మంటల్లో జిఒ ప్రతులను వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిరసనలు, పోరాటాలు రాజ్యాంగంలో పౌరుని ప్రాథమిక హక్కు అని, ఈ హక్కును కాలరాసే బ్రిటీష్ ప్రభుత్వాన్నే కాలగర్భంలో కలిపే వైనం స్వాతంత్ర్య ఉద్యమ పోరాటం నేర్పి గుణపాఠమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి తన పాదయాత్ర పోరాట ఫలితమే ముఖ్యమంత్రి పదవి వచ్చిందని, ఇప్పుడు ఎవరూ పోరాటాలు, ధర్నాలు చేయకూడదంటే రాష్ట్ర విముక్తి పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కావున వెంటనే జిఒ 1ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రభుత్వం విడుదల చేసిన జిఒ ప్రతులను పట్టణంలోని జగన్నాధపురం, గాసీవీధి, బెలగాంలోని జనశక్తి కాలనీ, ఎస్‌ఎన్‌ఎం కాలనీల్లో భోగి మంటలో వేసి ప్రజాసంఘాల, సిపిఎం నాయకులు, కార్మికులు దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి రాజశేఖర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ1 కాపీలను సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్వైనాయుడు ఆధ్వర్యాన శనివారం భోగి మంటల్లో వేసి దగ్ధం చేశారు. భోగి పండుగ సందర్భంగా పట్టణంలోని గాంధీనగర్‌లో శనివారం తెల్లవారుజామున నిర్వహించిన భోగి మంటల్లో జిఒ 1 కాపీలను తగులబెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి జీవోను వైసిపి ప్రభుత్వం అమల్లోకి తేవడం అన్యాయమన్నారు. ప్రజా పోరాటాలను అణిచివేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు టి.శంకరరావు, టి.వెంకటరావు, టి.ఇందు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ1ను రద్దు చేయాలని కోరుతూ మండలంలోని బాగువలస వద్ద జిఒ1 ప్రతులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజాసంఘాలు, ప్రతిపక్షాలు, ఉద్యోగులు నిరసన తెలియ జేయకుండా బ్రిటీష్ వారు కూడా అమలు చేయడానికి భయపడిన ఈ చట్టాలను ఈ ప్రభుత్వం అమలు చేయడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఇటువంటి నిర్ణయాల వల్ల ప్రభుత్వం ప్రజల నుంచి తీవ్ర ప్రజాగ్రహానికి గురికాక తప్పదని, తక్షణమే ఇటువంటి చీకటి చట్టాలను ప్రజలపై రుద్దకుండా ఈ జిఒలను ఉపసంహరించు కోవాలని కోరారు.

పార్వతీపురం :జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న సిఐటియు నాయకులు

సాలూరు :జిఒ ప్రతులను దహనం చేస్తున్న సిఐటియు నాయకులు

పార్వతీపురం :జిఒ ప్రతులను భోగిమంటల్లో వేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

సీతంపేటలో కమ్ముకున్న పొగ మంచు

కప్పేసిన మంచుదుప్పటి

ప్రజాశక్తి-పాలకొండ

జిల్లాలో ఏజెన్సీ ప్రాంతంలో పాటు మైదాన ప్రాంతాన్ని పొగమంచు కప్పేసింది. శనివారం వేకువజామున 4 గంటల నుంచి పొగమంచు దట్టంగా కురిసింది. ఉదయం 10 గంటల వరకు పొగమంచు కురవడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. రోడ్లు కూడా కనిపించకపోవడంతో వాహనదారులు కొంత ఇబ్బందులకు గురయ్యారు. ఈ పొగమంచు వలన మామిడిపూత రాలిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొగమంచు కావడంతో ప్రజలు పనుల నిమిత్తం బయటకు రావడానికి ఇబ్బంది పడ్డారు.

సీతంపేట: అసలే మన్యంలో దట్టమైన అడవులు ఉండటంతో పొగ మంచు పడుతుంది. అంతా మంచు దుప్పటి మాదిరిగా అల్లుకుంది. ఏజెన్సీలో శనివారం మంచుదుప్పటి కప్పేసింది. ఉదయం 9 గంటల వరకూ బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోవడంతో వృద్ధులు, చిన్నారులు చలితో ఇబ్బందులు తప్పడం లేదు సాయంత్రం మూడు గంటలయ్యేసరికి చలి పెరిగిపోతుంది. దీంతో ప్రజలు ఐదు గంటలలోపే మార్కెట్ చేసుకొని ఇంటికి వెళ్ళిపోతున్నారు. ఉదయం 9 గంటల వరకు ఎవరూ బయటకు రావడం లేదు. ఈ వారం రోజుల్లో విపరీతమైన చలి పెరిగిపోవడంతో ఎముకలు కొరికిన చలి వేస్తుంది. దీంతోపాటు చల్లటి గాలి వీస్తుంది. వృద్ధులు, చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఘనంగా భోగి పండగ

తెలుగు నాట సాంప్రదాయ పండగల్లో సంక్రాంతి ప్రధానమైంది. ఈ మూడు రోజుల పండగల్లో మొదటి రోజు పండగ భోగి. ఈ పండగను శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతి వీధిలో పెద్దఎత్తున కర్రలు పేర్చి మంటల వేసి భోగీ మంటలు కాగారు. అనంతరం వంటికి నలుగు పూసుకొని తలంటు స్నానం చేసుకొని కొత్తబట్టలు ధరించి పండగను ఘనంగా నిర్వహించుకున్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి పండగను వేడుకగా జరుపుకున్నారు. వేకువ జామునే సిద్ధం చేసుకున్న దుంగలు, కర్రలు వేసి భారీ భోగీమంటలు వేశారు. కుటుంబాలతో మంటల దగ్గరకు చేరుకుని పిడకల దండలు వేసే దృశ్యాలు మండలమంతా కనిపించింది. సంక్రాంతి కోసం బట్టలు, సరుకులు కొనుగోలు చేసేందుకు అన్ని పల్లెలు పార్వతీపురం పట్టణం వైపు పరుగుతీశాయి. దీంతో పట్టణంలోని మార్కెట్‌లో విపరీతమైన రద్దీ ఏర్పడింది. సాయంత్ర చిన్నారులకు భోగి పండ్లను పోసే కార్యక్రమాలు నిర్వహించారు.

కురుపాం : మండల కేంద్రంలోని పలు వీధుల్లో భోగి సంబరాలు పురస్కరించుకొని యువత, పిల్లలు పెద్దలు ఘనంగా భోగిమంటల్లో పిడకలు వేసి భోగి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక యువత మాట్లాడుతూ సంక్రాంతి పండుగ కనుక ఎక్కడ ఉన్నా సరే గ్రామాలకు చేరుకొని కుటుంబ సభ్యులంతా కలిసి ఒకే దగ్గర ఉండి జరుపుకొనేదన్నారు. కుటుంబ సభ్యులంతా కలవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.

జియ్యమ్మవలస : మండలంలో ప్రతి గ్రామంలో భోగి మంటలు వెలశాయి. నాలుగు నెలల పాటు కష్టపడి పండించిన పంటను ఇళ్లల్లో నింపుకొని ఆనందంగా నాలుగు రోజుల పాటు తమ కుటుంబాలతో పిల్లాపాపలతో స్నేహితులతో సరదా సందడిగా ఆటపాటలతో గడుపు కొంటారు. ఇలా ఉండగా గ్రామాల్లో భోగిపళ్ల ఉత్సవం సందడిగా నెలకొంది. పుట్టిన పిల్లలకు మొదటిసారిగా భోగి పండగ రోజున భోగి పండ్లను పోయడం గ్రామాల్లో సాంప్రదాయంగా వస్తున్నది. 12 ఏళ్లలోపు పిల్లలకు భోగి పండ్లను పోస్తుంటారు. రేగు పండ్లు, బంతిపూలు, చిల్లర నాణేలు కలిపి పిల్లల తలపై నుంచి జారవిడుస్తారు. భోగి పండ్లలో రేగు బంతి రెక్కలు ఉండటంతో అవి పడిన చోట క్రిములు దూరమవుతాయి. పిల్లలపై పళ్ళు పూలు పడటంతో క్రిములు దూరమై ఆరోగ్యవంతంగా ఉంటారని పూర్వీకులు ఈ కార్యక్రమం చేపట్టారు. దీన్ని ఆచారంగా కొనసాగిస్తూ తెలుగు నాట ప్రతి గ్రామీణ భోగిపల్ల ఉత్సవం అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారు.

కురుపాం : భోగిమంట వేస్తున్న ప్రజలు



జియ్యమ్మవలస : భోగిమంటలు కాగుతున్న ప్రజలు

కొనుగోలుదారులతో కిటకిటలాడిన పార్వతీపురం మార్కెట్

కిక్కిరిసిన పట్టణం

స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సంక్రాంతి పండుగ సందర్భంగా వివిధ సామాన్ల కొనుగోలు నిమిత్తం జిల్లా కేంద్రానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచే ప్రజలతో పట్టణం కిక్కిరిసిపోయింది. ఏ దుకాణం చూసినా కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. అంతేకాక పట్టణానికి వచ్చే వాహనాలతో పార్వతీపురం- రాయగడ రోడ్డు ట్రాఫిక్ స్తంభించింది.

కిటకిటలాడుతున్న దుకాణాలు

వీరఘట్టం : నిన్నటి వరకు బోసుపోయిన షాపులు సంక్రాంతి పండగకు ఒక్కసారిగా కిక్కిరిసిపోయాయి. ఒక్కసారిగా వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు మండల కేంద్రమైన వీరఘట్టంకు రావడంతో ప్రధాన రహదారితో పాటు అన్ని రకాల దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి.

వీరఘట్టం : కొనుగోలుదారులతో కిటకిటలాడిన వస్త్ర దుకాణం

శ్రీరామ్మూర్తి జ్ఞాపకార్థం నేడు ఆటల పోటీలు

ప్రజాశక్తి-సీతానగరం

ప్రజా నాయకుడు రెడ్డి శ్రీరామ్మూర్తి జ్ఞాపకార్థం ఆయన స్వగ్రామం రెడ్డివానివలసలో డివైఎఫ్ఐ ఆధ్వర్యాన ఆదివారం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు డివైఎఫ్ఐ, ఆ గ్రామ యూత్ కమిటీ నిర్వాహకులు రెడ్డి హరి తెలిపారు. 1987లో భారత ప్రజాతంత్ర యువజన సంఘం ప్రారంభించినప్పటి నుండి నేటి వరకు రెడ్డి వాని వలసలో ప్రతి ఏటా సంక్రాంతి సందర్భంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపాఉ. ఏడాది క్రితం కరోనాతో మృతి చెందిన సిపిఎం నాయకులు రెడ్డి శ్రీరామ్మూర్తి జ్ఞాపకార్థం ఈ ఏడాది పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటూ గ్రామం వచ్చిన యువజనులంతా కలిసి ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా స్లో సైక్లింగ్ రన్నింగ్, మహిళలకు ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. విజేతలకు మొదట ద్వితీయ బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు పన్ను ఉత్తర్వులు రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-పాలకొండ

సరుకు రవాణా, ప్రజారవాణా వాహనాలపై రాష్ట్ర ప్రభుత్వం పెంచిన త్రైమాసిక రోడ్డు పన్ను ఉత్తర్వులను రద్దుచేయాలని కోరుతూ శనివారం ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో ఆటోస్టాండ్ వద్ద ఆటో కార్మికులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ వెంటనే ఈ ఉత్తర్వులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తీవ్ర సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న రవాణా రంగంపై త్రైమాసిక రోడ్డు పన్ను పెంచి మరోసారి భారాలు వేయడం సరికాదన్నారు. కోవిడ్ అనంతరం కాలంలో పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలతో తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న రవాణా రంగాన్ని ప్రభుత్వం ఆదుకోకుండా రహదారుల మరమ్మతుల పేరుతో ఆయిల్‌పై ఒక్కో రూపాయి చెస్ విధించడం అన్యాయమన్నారు. ఎక్కడ కూడా రోడ్లు మరమ్మతులు చేపట్టిన దాఖలాల్లేవన్నారు. పొరుగు రాష్ట్రాల్లో నాలుగు త్రైమాసికాల పన్నులు రద్దు చేయగా ఎపిలో మాత్రం ఒక్కరూపాయి కూడా వదిలిపెట్టలేదన్నారు. దీనివల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టాభి, బి.త్రినాధ్, సత్యం, సింహాచలం, రామకృష్ణ, నీలకంఠం, నందు తదితరులున్నారు.

నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రయివేటుపై ఉన్న ప్రేమ ప్రభుత్వరంగంపై ఏదీ?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రజల్ని ఏలేందుకు పదవి కావాలి. కానీ, అదే ప్రజలకు ఉపాధి, ఉద్యోగాలు అవకాశాలు కల్పించే బాధ్యత అక్కర్లేదు. అధికారం కావాలి. కానీ, దాన్ని ప్రాంతాల అభివృద్ధికి ఉపయోగించాలన్న జిజ్ఞాస లేదు. సహజ వనరులను స్థానికంగా ఉపయోగించాలన్న ఆత్రుత అసలే లేదు. ఇదీ జిల్లాలో మైనింగ్‌పై అటు ప్రభుత్వంగానీ, పాలకులుగానీ అనుసరిస్తున్న తీరు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అత్యంత విలువైన మాంగనీస్, మెటల్, గ్రావెల్, ఇసుక తదితర గనులు పుష్కలంగా ఉన్నాయి. ముఖ్యంగా విజయనగరం జిల్లా గరివిడి, చీపురుపల్లి, మెరకముడిదాం, నెల్లిమర్ల, రాజాం, తెర్లాం మండలాలు మాంగనీస్ గనులకు పెట్టింది పేరు. అత్యంత నాణ్యమైన ఖరీదైన గనులు ఈ మండలాల్లో ఉన్నాయి. ఎస్.కోట, గజపతినగరం తదితర నియోకవర్గాల్లో మెటల్, గ్రావెల్, నాగవళి, గోస్తనీ, చంపావతి, సువర్ణముఖి తదితర నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక ఖనిజాలు ఉన్నాయి. వీటి విక్రయం ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు ఆదాయం వస్తోంది. కానీ, ఇదే ఖనిజ సంపదను స్థానికంగా ఉపయోగిస్తే వెనుకబడ్డ విజయనగరం, పార్వతీపురం జిల్లాలో ఎంతో అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంది. ముఖ్యంగా మాంగనీస్ గనులను ఉపయోగించుకుని జిల్లాలో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు. ఉన్న పరిశ్రమలకు కూడా ఇక్కడి గనులను కేటాయిస్తే ఉపాధి మరింత మెగుపడేందుకు అవకాశం ఉంది. కానీ, పాలకులుగానీ, ఇరు జిల్లాలకు చెందిన అమాత్యులుగానీ ఆదిశగా ప్రయత్నించడం లేదు. ఈ ప్రాంతంలోని మాంగనీస్ అత్యంత నాణ్యతగా ఉండడంతో సెయిల్, గెయిల్ వంటి ప్రభుత్వ రంగ స్టీల్‌ప్లాంట్లకు కేటాయించాలన్న ఆలోచనను కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకున్నాయి. పైగా మాంగనీస్‌ను లీజు పద్ధతిలో ఎలాగైనా పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు మైనింగ్ పాలసీని మరింత సులభతరం చేసింది. ఎపి ఎంఎంసి (ఆంధ్రప్రదేశ్ మైనర్ మినరల్ కన్‌స్ట్రక్షన్) 1966ను సరళతరం చేసి, 2022 మార్చి 14న ఎపి ఎంఎంఆర్‌ను విడుదల చేసింది. ఇందులో భాగంగా జిఒ నెంబర్ 30, 14లను తీసుకొచ్చింది. ఈ క్రమంలోనే విజయనగరం జిల్లాలోని వివిధ మండలాల్లోవున్న మాంగనీస్ గనులను వివిధ ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టింది. 56లక్షల మెట్రిక్ టన్నులు మాంగనీస్ గల గిరివిడి మండలం దేవాడ బ్లాక్‌ను మహాలక్ష్మి మినరల్స్ అనే ప్రైవేట్ కంపెనీ దక్కించుకుంది. జిల్లాలోని సుమారు 19మాంగనీస్ బ్లాకులను ఆర్‌బిఎస్ఎస్‌డి-2, మోర్ ఎల్లాయిస్ వంటి కంపెనీలు దక్కించుకున్నట్లు సమాచారం. గరిడివి మండలం దేవాడ బ్లాక్ తవ్వకాల విషయమై గత ఏడాది నవంబర్ 22న కొండపాలెం బ్లాక్ తవ్వకాలకు డిసెంబర్ 21న అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. జిల్లా అత్యంత వెనుకబడి ఉన్నందున స్టీల్, ఫెర్రో ఎల్లాయిస్ వంటి పరిశ్రమలను ప్రభుత్వ రంగంలో ఏర్పాటుచేసి, వాటికి స్థానికంగావున్న మాంగనీస్ గనులను కేటాయించాలని ఈ గ్రామాల్లోని ప్రజలు, కార్మికులు డిమాండ్ చేశారు. నివాసాలకు కేవలం 500మీటర్ల దూరంలో తవ్వకాలు చేపడితే కాలుష్య సమస్య ఎదుర్కోవాల్సివస్తుందని, అనారోగ్య సమస్యలు ఉత్పన్నమౌతాయని కూడా స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటినీ ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందని అధికారులు చెప్పినప్పటికీ ఆచరణలో అటువంటి చర్యలేవీ కనిపించడం లేదు. మరోవైపు తవ్వకాలకు అనుమతులు చకచకా ఇచ్చేస్తున్నారు. దీంతో, ప్రజల్లో ఆందోళన మొదలైంది. ఇంకోవైపు అరుదైన మాంగనీస్ గనులు ప్రైవేటు పరం కావడంతో ఉపాధి మార్గాలు కనిపించడం లేదు. ఈనేపథ్యంలో జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలుగానీ, ప్రభుత్వంగానీ పెట్టుబడిదారుల లాభాల కోసం తప్ప, ప్రభుత్వ రంగంలో మాంగనీస్ పరిశ్రమలు ఏర్పాటు చేసి, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచాలన్న చిత్తశుద్ధి లేదని పలువురు విమర్శిస్తున్నారు.



వాహనాలను పరిశీలిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

ఎఒబిలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-గుమ్మ లక్ష్మీపురం

గుమ్మలక్ష్మీ పురం మండలం, మండలం ఒడిశా సరిహద్దు గ్రామాలైన కేదారి పురం, వంగర, కేసర సరిహద్దు గ్రామాలలో ఎల్విన్ పేట పోలీసులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎల్విన్ పేట పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.సత్యనారాయణ, సబ్ ఇన్స్పెక్టర్ షణ్ముఖరావు సిబ్బందితో ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి వచ్చే వాహనాలను తనిఖీలు చేశారు. అనంతరం సరిహద్దు గ్రామమైన కేదారిపురం వెళ్లి కోడిపందాలు,పేకాట నిర్వహించవద్దని ఒకవేళ నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పు అని గ్రామస్తులను హెచ్చరించారు. ఈ సందర్భంగా సచివాలయ పోలీసులతో మాట్లాడుతూ, ఎప్పటికప్పుడు సమాచారాన్ని తమకు అందించాలని ఆదేశించారు.

హెచ్‌సిని సన్మానిస్తున్న ఎఎస్ఐ, వివేకానంద వాసులు

సమాజ సేవకునికి సత్కారం

పార్వతీపురంటౌన్ : స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా, వృద్ధ మిత్ర కో- ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న కె.కృష్ణమూర్తి తన జీతంలో కొంత నిధులను వెచ్చించి పేదలకు, వృద్ధులకు, వికలాంగులకు పేద విద్యార్థులకు ప్రతినెలా చేసిన సేవలకు మెచ్చి పట్టణ శివారులో ఉన్న మూడో వార్డు వివేకానంద కాలనీకి చెందిన రఘునందన సత్యనారాయణ, ఇసకల ఉదయ్ కుమార్ పట్టణ పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ సురేష్, ట్రాఫిక్ ఎస్ఐ, పోలీస్ సిబ్బంది సమక్షంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎదుటివారి కష్టాల్లో ఉన్నప్పుడు వారి బాధలను గుర్తించి అన్ని విధాలా సహాయం అందిస్తున్న కృష్ణమూర్తి అందరికీ ఆదర్శమని కొనియాడారు.

వాహన చోదకులతో మాట్లాడుతున్న ఎస్ఐ నీలకంఠం

మైనర్లు వాహనాలు నడపొద్దు

సీతానగరం : మైనర్ బాలురు వాహనాలు నడపొద్దని ఎస్ఐ కె.నీలకంఠం అన్నారు. శనివారం హనుమాన్ జంక్షన్‌లో అవగాహన సదస్సు జరిగింది. ప్రధానంగా మైనర్లు వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వీటిపై వారి తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వాసుదేవనాయుడు, తిరుపతిరావు, రామకృష్ణ, సత్యనారాయణ, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

బొలెరో వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

పార్వతీపురంరూరల్ : కొమరాడ మండలం పరశురాంపురం గ్రామానికి చెందిన బి.విశ్వనాథ్, అతని స్నేహితుడు సహదేవ్ కలిసి శనివారం పార్వతీపురం పట్టణంలో తమ పనులు ముగించుకుని కొత్తవలస మీదుగా తమ స్వగ్రామానికి వెళ్తున్నారు. గోపాలపురం, మార్కొండపుట్టి కూడలి సమీపంలో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్రమైన గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండో ఎంఇఒ పోస్టులను భర్తీ చేయాలి

పార్వతీపురం టౌన్ : విద్యా శాఖలో పరిపాలనా సౌలభ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కొత్తగా మంజూరు చేసిన 692 మండల విద్యాశాఖాధికారి పోస్టులను వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎపి ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. జిఒ 154 ప్రకారం ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన ఈ పోస్టులపై ప్రస్తుతం పనిచేస్తున్న ఎంఇఒ సంఘం తమకు అనుకూలంగా లేదని ఈ జీవోను రద్దు చేయమని హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిందని అన్నారు. కానీ తదుపరి ఆలోచించుకొని వేసిన రిట్ పిటిషన్‌ను ఉపసంహరణ చేసుకున్నట్టుగా సమాచారం తెలుస్తోందన్నారు. కావున ముఖ్యమంత్రి ఆలోచన ప్రకారం కొత్తగా సృష్టించిన అదనపు 692 మండల విద్యాశాఖాధికారి పోస్టులను (ఎంఈఓ- 2) భర్తీ చేయాల్సిన ఆవశ్యకత ఉందని సామల తెలిపారు. ఇందుకుగాను జాప్యం లేకుండా జీవో 154 ప్రకారం ఎంఇఒ పోస్టులను భర్తీ చేసేందుకు జాబ్ చార్ట్, విధి విధానాలను తక్షణమే రూపొందించి, ముఖ్యమంత్రి ఆలోచనకు కార్యరూపం ఇవ్వాలని, ఇందుకు విద్యాశాఖ మంత్రి, విద్యాశాఖ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సామల విజ్ఞప్తి చేశారు.

చదువుతోనే బంగారు భవిష్యత్తు

బొబ్బిలి : చదువుతోనే బంగారు భవిష్యత్తు లభిస్తుందని డిఎస్‌పి మోహనరావు తెలిపారు. శనివారం స్థానిక శ్రీ సూర్య రెసిడెన్సీలో రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు ఆధ్వర్యంలో బాలికలకు సైకిళ్లు పంపిణీచేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ రోటరీ చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రజోపయోగకరంగా ఉంటున్నాయన్నారు. రోటరీ అంటే సేవ అనేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర ఆర్థిక సంఘ మాజీ సభ్యులు తూముల భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సేవా దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ పూర్తయి ఫార్మసీ చేయాలని ఆసక్తి ఉన్న బాలికలకు లోకబందు ఫార్మసీ విద్యాసంస్థల్లో ఉచితంగా చదువుకునే వెసులుబాటును రోటరీ ద్వారా కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆపరేషన్ ఇమాజిన్‌లో భాగంగా 21 మంది బాలికలకు లక్షా 26 వేలు విలువైన 21 సైకిళ్లను డిఎస్‌పి మోహనరావు, భాస్కరరావు, తూముల కార్తిక్, జెసి రాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి శ్రీహరి, పోలియో చైర్ ఎస్.అప్పలరాజు, కారుణ్య ఫౌండేషన్ చీఫ్ ఆర్గనైజర్ డేవిడ్ జె విక్టర్, కార్యనిర్వాహక కార్యదర్శి కె.రామకృష్ణ, బి.లక్ష్మణరావు, శంకరరావు పాల్గొన్నారు.

వైసిపి పాలన అంతంతోనే ప్రజలకు సుఖం

జిఒ1ను రద్దు చేయాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ప్రజల ప్రాథమిక హక్కులను హరించేలా రాష్ట్రంలో కొనసాగుతున్న సైకోపాలన అంతమైతేగానీ రాష్ట్ర కష్టాలు సుఖాంతమవ్వవని టిడిపి నాయకులు అన్నారు. మండలంతో పాటుగా పట్టణంలో పలు చోట్ల శనివారం టిడిపి నాయకులు జిఒ. 1 ప్రతులను భోగీ మంటల్లో వేసి దగ్ధం చేశారు. కార్యక్రమంలో భాగంగా మండలంలోని కృష్ణపల్లిలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇదే ప్రభుత్వాన్ని కొనసాగిస్తే రాజ్యాంగానికి విలువ, గౌరవం లేకపోవడమే కాకుండా, పౌరహక్కులకు తీవ్రమైన విఘాతం కలుగుతుందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న నియంతపాలన పోవాలంటే తెలుగుదేశాన్ని ప్రతిఒక్కరూ బలపరచాలని కోరారు. కార్యక్రమంలో మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు దొగ్గ మోహన్, జి.రవికుమార్, నాయకులు జి.వెంకటనాయుడు, బిచంద్రమౌళి, జాగాన రవికుమార్, కెంగువ ప్రదీప్‌కుమార్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

జిఒ 1 ప్రతులను దగ్ధం చేస్తున్న టిడిపి నాయకులు

పాలకొండ రూరల్ : మండలంలో అవలంగి గ్రామంలో టిడిపి నాయకులు జిఒ కాపీలను భోగిమంటలో వేశారు. మాజీ సర్పంచ్ కోట సంగంనాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

కురుపాం : భోగి మంటల్లో ప్రభుత్వం విడుదల చేసినటువంటి జీవో 01 కాపీలను తెలుగుదేశం మండల కన్వీనర్ కెవి కొండయ్య ఆధ్వర్యంలో టిడిపి నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం నియంతృత్వ పాలన కొనసాగిస్తుందని, కనీసం సభలు, సమావేశాలు పెట్టుకోవడానికి కూడా స్వేచ్ఛ లేకుండా బ్రిటీష్ పాలన ఆంధ్రప్రదేశ్లో ఉందని అన్నారు. కావున వెంటనే జీవో 01 వెనక్కి తీసుకోవాలని, ప్రజలంతా వైసిపికి తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

జిఒ 1ను రద్దు చేయాలని నిరసన

వీరఘట్టం : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిఒ ఒకటిని రద్దు చేయాలని కోరుతూ మండలం చలివేంద్రిలో శనివారం సిపిఐఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ కార్యదర్శి పి.భాస్కరరావు మాట్లాడుతూ బ్రిటీష్ పాలనలో కూడా ఇటువంటి జీవోలు లేవని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల గొంతునొక్కేందుకు ఇటువంటి వాటికి పాల్పడుతున్నట్లు ఆరోపించారు. తక్షణమే ఈ జీవోను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం జీవో ప్రతులను భోగి మంటలో కాల్చివేశారు. కార్యక్రమంలో గౌరు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిఒ 1 పత్రులను దగ్ధం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

కార్యక్రమంలో తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, కర్రి శ్రీను,బుజ్జి,మహేష్, చంటి, గంగులు, బోటు గౌరి, బుడ్డు, గంగయ్య,అజిత్ తదితరులు పాల్గొన్నారు .

వీరఘట్టం : వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిన చీకటి జిఒను మండలంలోని ఎంరాజపురంలో టిడిపి పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ భోగి మంటల్లో జిఒ1 ప్రతుల్ని తగలబెట్టారు. అనంతరం భోగిమంట సంబరాలు జరిపారు. కార్యక్రమంలో టి సత్యంనాయుడు, జి గౌరు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జిఒ 1 పత్రులను దగ్ధం చేస్తున్న సిపిఎంఐఎల్ లిబరేషన్ నాయకులు

అగ్ని ప్రమాద బాధితులకు పలువురు చేయూత

ప్రజాశక్తి - సీతానగరం

మండల కేంద్రంలో శుక్రవారం సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయి రోడ్డునపడ్డ నక్కల కుటుంబాల వారికి పలువురు ముందుకు వచ్చి చేస్తున్న సహాయం మరువలేనిది. ఈ అగ్నిప్రమాదంలో చెరకుబిల్లి గంగయ్య, చెరకుబిల్లి అప్పల నరసమ్మ, చెరకుబిల్లి కవిత, చెరకుబిల్లి నరేష్ కుటుంబాలు సర్వస్వం కోల్పోయిన సంగతి తెలిసిందే. వీరితో పాటు మరో మూడు కుటుంబాలు పాక్షికంగా నష్టపోయాయి. ప్రభుత్వం తరుపున రెవెన్యూ అధికారులు బియ్యాన్ని అందజేశారు. శనివారం ఎంపిడిఒ ఎఒ ప్రసాద్ వీరికి స్టీల్ సామాగ్రి, బట్టలను అందజేసారు. వైసిపి మండల అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు, అతని కుమారుడు బొంగు శ్రీకాంత్, సాహితీ ఏడుకుటుంబాలకు సరిపడే రూ.10వేల సామాగ్రిని అందజేశారు. సీతానగరం ఆర్యవైశ్యసంఘం నాయకులు మమ్ముల విశ్వేశ్వరరావు, ఆరిశెట్టి సత్యనారాయణ, గురుమూర్తి, కూర్మదాసు శ్రీనివాసరావు, సురేష్, వాసు, త్రినాథ, దేముడు, ఆరిశెట్టి గోవింద్ తదితరులు బాధిత కుటుంబాలకు పప్పులు, బియ్యం, కూరగాయలు, దుప్పట్లు, దోవతులు తదితర సామాగ్రిని అందజేశారు. స్థానికులు పలువురు పల రకాలుగా సహాయం చేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గరికయ్య, ఉప సర్పంచ్ అరవింద్, ఎంపిటిసిలు గౌరీకిరణ్, బురిడి కుసుమ సూర్యనారాయణ, సోషల్ మీడియా మండల కన్వీనర్ సురేష్, వార్డు సభ్యులు బూడి రామారావు, రైల్వే ఉద్యోగి ప్రసాద్,విఆర్ఓ సింహాచలం,వాలంటీర్లు పాండవులు, తరుణ్, విశ్వబ్రాహ్మణసంఘంనేత కష్ణ తదితరులతో పాటు గూడెంవీధి ప్రజలు పాల్గొన్నారు

బేబినాయన చేయూత

అగ్నిప్రమాద బాధితులకు బొబ్బిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బేబి నాయనా ఒక్కొక్క కుటుంబానికి రూ.2వేల నగదు, బియ్యం, పప్పు, కూరలు, దుప్పట్లు చొప్పున అందజేశారు. బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ, గరికయ్య, నాయకులు సాలా హరి, బుడితి శ్రీను, సబ్బాన శ్రీను,సతీష్,సత్యనారాయణ , కష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు వంటసామాగ్రి, బట్టలు అందజేస్తున్న బేబినాయన

జనసేన సాయం...

జనసేన నాయకులు కూడా బాధిత కుటుంబాలను పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి రూ.2వేలు చొప్పున నగదును జనసేననేత కొయ్యాన మోహనరావు బాధిత కుటుంబాలకు అందజేసారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఐటి విభాగంనేత పైల సత్యనారాయణ, పార్వతీపురం, బలిజిపేట మండలాల పార్టీ అధ్యక్షులు ఆగూరి మని, పోలినాయుడు, అల్లు రమేష్, కె.సత్యనారాయణ, జయశంకర్, కిషోర్, సూర్యనారాయణ తదితర జనసైనికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమ నేత

యుఎ నర్సింహం మృతి

నివాళులర్పించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

యుఎ నర్సింహం

ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, ఆపస్ రాష్ట్ర మాజీ నాయకులు యుఎ నర్సింహం శనివారం తెల్లవారు జామున విజయనగరంలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆయన వయసు 90 సంవత్సరాలు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నర్సింహం మరణ వార్త తెలిసిన వెంటనే డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఆయన నివాసానికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగా ఢ సానుభూతిని తెలియజేశారు. తన సాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఇచ్చే ప్రతిభ పురస్కారాలకు గాను , విద్యా కమిటీకి మాస్టారు చైర్మన్‌గా ఉంటూ ఎనలేని సేవలు అందించారని అన్నారు. మాస్టారి మరణం ఉపాధ్యాయులకే కాకుండా, తనకు వ్యక్తిగతంగా తీరనిలోటు అని అన్నారు. 1932లో సింహాచలంలో జన్మించిన యుఎ నర్సింహం 1953లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. నెల్లిమర్ల, ఎస్.కోట, పూసపాటిరేగ, వియ్యంపేట, రామ తీర్థాలులో పనిచేసి 1990లో ఉద్యోగ విరమణ చేశారు. 1983 సెప్టెంబర్ 5న ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చేతులమీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా విశిష్ట పురస్కారం అందుకున్నారు. 1984 సెప్టెంబర్ 5న జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా అప్పటి రాష్ట్రపతి జ్ఞాని జైల్ సింగ్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఉపాధ్యాయ బంధుగా పిలవబడే మాస్టారు ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు. ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించడంలో వారధిగా నిలిచారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో రెండుసార్లు పోటీ చేశారు. మాస్టారు మరణ వార్త తెలియగానే నగరానికి చెందిన ప్రముఖులు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తరలివచ్చి ఆయనకు ఘన నివాళులర్పించారు. మాస్టారు భౌతికాయానికి దాసన్నపేట శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి.

పండగ వేళ అప్రమత్తం : ఎస్ఐ

ప్రజాశక్తి - వీరఘట్టం

సంక్రాంతి పండుగ సందర్భంగా పోలీసులిచ్చిన సలహాలు, సూచనలు ప్రజలు తప్పనిసరిగా పాటించాలని స్థానిక ఎస్సై ఎం.హరికృష్ణ ప్రజలకు సూచించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి సెలవులు కావడంతో ప్రజలంతా తమ సొంత గ్రామాలకు బయలుదేరి వెళ్తున్నారన్నారు. ఇటువంటి సమయంలో ఎవరు కూడా వారి ఇళ్లల్లో విలువైన ఆభరణాలు విడిచి వెళ్లరాదని, ఒకవేళ విడిచినచో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా అందరూ సొంత గ్రామాలకు వెళ్లేవారు ఎక్కువగా ఉండే రోడ్లు ఎక్కువగా రద్దీగా ఉండటం వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాలు చేసే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనాలు నడిపిన వారు తప్పనిసరిగా హెల్మెంట్లు ధరించాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా కోడి, గొర్రెపోతు పందాలతో పాటు పేకాట ఆడరాదునిస్పష్టం చేశారు.

గడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి - మక్కువ

మంటలను ఆర్పుతున్న సిబ్బంది

మండలంలోని గోపాల పురంలో శనివారం గడ్డివాముల దగ్ధమయ్యాయి. ఎస్.తిరుపతి రావుకు చెందిన గడ్డివాములు దగ్ధం కాగా, అప్రమత్తమైన గ్రామస్తులు సాలూరు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వెంటనే గ్రామానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. భోగి పండుగలో అందరూ ఉండగా అగ్ని ప్రమాదం సంభవించడంతో ఒకంత ఆందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పి వేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు

పలుచోట్ల పేదలకు బట్టలు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రోజువారీగా గుమ్మలక్ష్మీపురంలో పరిసరాలను పరిశుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ శ్రమ జీవులుగా బతుకుతున్న పలువురు గ్రీన్ అంబాసిడర్లకు సంక్రాంతి సందర్భంగా సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, స్థానిక స్వాతి రెడీమేడ్ షాపు యజమాని కొనిస సూర్యం నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గౌరీశంకర్ మాట్లాడుతూ ఎండనకా వాననకా నిత్యం గ్రామాన్ని పారిశుధ్య వాతావరణంలో ఉంచుతూ గ్రీన్ అంబాసిడర్ల కష్టాలను గుర్తించి స్వాతి రెడీమేడ్ సభ్యులు వస్త్రాలను పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు, కొనిస సూర్యం పారిశుధ్య కార్మికులకు పండగ ఖర్చుల నిమిత్తం కొంత నగదును ఆర్థిక సాయం చేశారు. దీంతో పారిశుధ్య కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం గ్రామ సచివాలయం కార్యదర్శి కిషోర్, ఉప సర్పంచ్ కొత్తకోట కిషోర్ ఉన్నారు.

మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ డోకుల గూడలో పత్తిక మాధవరావు కుటుంబానికి సర్పంచ్ సైతన్య స్రవంతి ఆధ్వర్యంలో ఎస్ఐ షణ్ముఖ రావు చేతుల మీదుగా ఆ కుటుంబానికి నూతన వస్త్రాలు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ, సర్పంచ్ మాట్లాడుతూ మాధవరావు పేదరికంతో ఉంటూ జీవనాన్ని సాగిస్తున్నాడన్న విషయాన్ని తెలుసుకొని కొద్దిపాటి సహాయాన్ని అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు గంటా రాజేంద్ర, కొణిశ రాజా, తుంబలి వినోద్ తదితరులు ఉన్నారు.

సీతంపేట : మండలంలోని పులిపుట్టిలో గల యువ మిత్ర సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆ సంస్థ డైరెక్టర్ గొర్లె గడ్డియ్య శనివారం వృద్ధులకు, నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గడ్డియ్య మాట్లాడుతూ ప్రతిఏటా పేదలకు, వృద్ధులకు భోగి రోజు దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. గత 8ఏళ్లుగా వృద్ధులకు, నిరుపేదలకు బట్టలు పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే అమ్మ బాలల అనాధ శరణాలయం, అమ్మ వృద్ధాశ్రయం నడిపిస్తున్నామని, సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఆ కమిటీ సభ్యులు సుజాత, అప్పల నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : సంక్రాంతి సందర్భంగా మండలంలోని పాంచాలికి చెందిన పలువురు పేదలకు ఆ గ్రామ సర్పంచ్ గూడెపు యుగంధర్ శనివారం దుస్తులు పంపిణీ చేశారు. గ్రామంలోని పారిశుధ్య కార్మికులతో పాటు మరికొంతమంది నిరుపేద వృద్ధులు, వికలాంగులకు కొత్త దుస్తులు, దుప్పట్లు అందజేశారు. గ్రామంలోని పేదలను ఎప్పటికప్పుడు ఏదో రకం ఆదుకుంటున్న సర్పంచ్‌ను గ్రామస్తులను అభినందిస్తున్నారు.

పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న ఎస్ఐ, సర్పంచ్

పాలకొండ రూరల్ : సంక్రాంతి పండగ సందర్భంగా శనివారం జల్లువీధిలో జల్లు నారాయణరావు గీతాపారాయణ సభ్యులకు వస్త్రదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవ చేయడం సంతృప్తి కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో కడగల రమణ, తుమ్మగుంట శంకరరావు, కె.రామ్మోహనరావు, పైల తవిటినాయుడు, చింతా భాస్కరరావు తదితరులున్నారు.

పాచిపెంట : పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ యుగంధర్

పారిశుధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ గౌరీశంకర్

పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న యువ మిత్ర సర్వీస్ సొసైటీ డైరెక్టర్

పండగ పూట విషాదం

- రేగలో 13 పూరిళ్లు దగ్ధం
- రూ. 30 లక్షలు ఆస్తి నష్టం
- కట్టుబట్టలతో మిగిలిన బాధితులు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని రేగ గ్రామ పంచాయతీలో శనివారం తెల్లవారుజామున సంభవించిన అగ్ని ప్రమాదంలో 13 పూరిళ్లు దగ్ధమయ్యాయి. రూ 30 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. 13 కుటుంబాలకు చెందిన 55 మంది కట్టు బట్టలతో మిగిలారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ఈ పమాదం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనలో దమ్ము అచ్చియమ్మ , బత్తిన అప్పలనరస, సిమ్మ రాము , బి.ముత్యాలమ్మ , ఎన్.ఆచారి , కె.పైడమ్మ , ఎస్.ఆదినారాయణ , ఎన్ .ప్రసాద్ , పి.నీలకంఠం , రావాడ జోగినాయుడు , బి.కనకరాజు , బి.బంగారమ్మ లకు చెందిన ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఎంపిటిసి సభ్యుడు బొడ్డు గణపతి ఇచ్చిన సమాచారం మేరకు కొత్తవలస అగ్నిమాపక వాహనం హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఎస్ఎఫ్ఒ వై.అశోక్ కుమార్ , సిబ్బంది మంటలను అదుపు చేశారు. స్థానిక ఎంపిపి గేదెల శ్రీనివాసరావు బాధితులకు రూ.13 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతోపాటు వైసిపి మండల అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ (సింగపూర్) , తహశీల్దార్ తామరాపల్లి రామకృష్ణ రూ.10 వేలు చొప్పున ఆర్థికంగా సాయం అందించారు. ఈ సందర్భంగా ఎంపిపి శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్ని ప్రమాద బాధితులందరికీ ప్రభుత్వపరంగా ఆదుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు కోరారు. బాధితులందరికీ ప్రభుత్వమే పక్కా గృహాలు కట్టించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

మంటలను ఆర్పుతున్న సిబ్బంది